క్లుప్తంగా

కొండాపురంలో ఫ్యామిలీ డాక్టర్

పాలకొండ: మండలంలోని కొండాపురంలో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. అన్నవరం పీహెచ్‌సీ వైద్యురాలు వెన్నెల రోగులను పరీక్షించి మందులు అందజేశారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ దేవి, సిబ్బంది పాల్గొన్నారు.

బడితోట బాగుంది..



బడితోటను పరిశీలిస్తున్న డీఈఓ పగడాలయ్య

సీతంపేట: మండలంలోని హడ్డుబంగి గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలను డీఈఓ పగడాలమ్మ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో పెంచుతున్న కూరగాయలు, ఇతర పంటలను పరిశీలించారు. బడితోటలో పండిస్తున్న పంటలనే విద్యార్థులకు భోజనంలో అందిస్తున్నట్లు హెచ్‌ఎం ఉమావాణి తెలిపారు. అనంతరం విద్యార్థుల విద్యాప్రగతిపై డీఈఓ ఆరా తీశారు.

చట్టాలపై అవగాహన అవసరం

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): శాంతిభద్రతల పరిరక్షణకు చట్టాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని ఎల్విన్‌పేట సీఐ బి.హరి అన్నారు. కురుపాం మండలంలోని నీలకంఠాపురం ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలను శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ఆయన సమావేశమయ్యారు. విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని, సైబర్ నేరాలు, మాదకద్రవ్యాలు వల్ల కలిగే అనర్థాలు, పోక్సో చట్టంపై అవగాహన కల్పించారు. ఎస్‌ఐ నీలకంఠారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విజేతలకు అభినందనలు



గెలుపొందిన విద్యార్థులను అభినందిస్తున్న ఎంఈఓలు

వీరఘట్టం: మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో 'భారతదేశం 2047 నాటికి అభివృద్ధి చెందాలంటే ఏఏ రంగాలపై దృష్టి సారించాలి' అనే అంశంపై శుక్రవారం వ్యాసరచన, డిబేట్ పోటీలు నిర్వహించారు. విజేతలుగా నిలిచినవారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓలు డి.గౌరినాయుడు, ఆర్.ఆనందరావు, తదితరులు పాల్గొన్నారు.

104 సంచార వైద్య సేవలు

సీతానగరం: మండలంలోని గుమ్మిడివరం, అప్పయ్యపేట గ్రామాల్లో 104 సంచార వైద్య సేవల ద్వారా పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ ఉష ఆధ్వర్యంలో శుక్రవారం వైద్య శిబిరాలు నిర్వహించారు. గ్రామాల్లో అనారోగ్యంతో బాధపడుతున్న వారిని పరీక్షించారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. సుమారు 60 మందికి వైద్య పరీక్షలు చేశారు. శిబిరాల్లో సిబ్బంది సంధ్య, సింహాచలం, పార్వతి, 104 సిబ్బంది ప్రసాద్, ఈశ్వరరావు పాల్గొన్నారు.

గర్భిణులకు సీమంతం



సరాయివలసలో గర్భిణులకు సీమంతం నిర్వహిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

మక్కువ: మండలంలోని సరాయివలస గ్రామం అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం సర్పంచ్ తెర్లి మోహిణి అధ్యక్షతన పోషకాహార వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ పి.రాజశ్రీ ఆధ్వర్యంలో గర్భిణులకు సీమంతం నిర్వహించారు. ఆరోగ్యంపై గర్భిణులు, బాలింతలకు సూపర్‌వైజర్ అవగాహన కల్పించారు. పౌష్టికాహారం ప్రాముఖ్యత, వ్యక్తిగత పరిశుభ్రతపై వివరించారు. పాలు, పండ్లు, ఆకుకూరలు ఎక్కువగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, మక్కువ సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కళాశాలలో వైద్య శిబిరం

సాలూరు: స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో వైద్యశిబిరం నిర్వహించారు. స్వచ్ఛత హి సేవ కో ఆర్డినేటర్, కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ కె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో భాగంగా ఈ నెల 17 నుండి వచ్చే నెల 2 వరకు ప్రతి రోజు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

మున్సిపల్ కమిషనర్ బాధ్యతల స్వీకరణ

సాలూరు: మున్సిపల్ కమిషనర్‌గా సీహెచ్ సత్యనారాయణ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఆయనకు మున్సిపల్ అధికారులు, సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందించారు. ఈయన గతంలో బొబ్బిలి పట్టణాభివృద్ధి సంస్థలో ఏఓగా విధులు నిర్వహించారు.

● సమస్యలకు పరిష్కారం..

స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్‌లో తిష్ట వేసిన సమస్యలకు డిపో మేనేజర్ పి. వెంకటేశ్వరరావు శుక్రవారం పరిష్కారమార్గం చూపారు. కాంప్లెక్స్‌లోని సమస్యలపై ఇటీవల సాక్షిలో 'అపరిశుభ్రంగా ఆర్టీసీ కాంప్లెక్స్' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనికి డిపో మేనేజర్ స్పందిస్తూ తాగునీటి ట్యాంక్‌లను శుభ్రం చేయించారు. అలాగే పేరుకుపోయిన మురుగును తొలగించే ఏర్పాట్లు చేశారు. నగర పంచాయతీ అధికారులను సమన్వయం చేసుకుని పూర్తిస్థాయిలో పారిశుధ్య పనులు చేపడతామని సహాయ మేనేజర్ (ట్రాఫిక్) ఎస్.లక్ష్మణరావు, సూపరింటెండెంట్ వైపీ రావు తెలిపారు. కార్యక్రమంలో ఆర్టీసీ హెడ్ కానిస్టేబుల్ ఐ.ఉమామహేశ్వరరావు, ఎస్‌డీఐ ఎస్ఎన్.రాజు, తదితరులు పర్యవేక్షించారు. పాలకొండ రూరల్



రక్షిత నీటి ట్యాంకులను శుభ్రం చేయిస్తున్న ఆర్టీసీ అధికారులు

ఆర్థిక బకాయిలు విడుదల చేయాలి

వీరఘట్టం: ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు రావాల్సిన ఆర్థిక బకాయిలను తక్షణమే విడుదల చేయాలని యూటీఎఫ్ నాయకులు కోరారు. మండలంలోని రేగులపాడు, కొంచ, కత్తులకవిటి, హుస్సేనపురం, తూడి, వండువ, చిదిమి గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలను శుక్రవారం వీరు సందర్శించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఉన్నత పాఠశాలల్లో బోధనేతర సిబ్బందిని నియమించాలని, కేజీబీవీ సిబ్బందికి ఎంపీఎస్ వర్తింపజేయాలని కోరారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు మజ్జి పైడిరాజు, బి.దుర్గాప్రసాద్, కె.గోవిందరావు, తదితరులు పాల్గొన్నారు.



వండువ పాఠశాలలో ఉపాధ్యాయ సమస్యలపై మాట్లాడుతున్న పైడిరాజు

నీమాస్త్రంతో పంటలకు మేలు

భామిని: నీమాస్త్రంతో పంటలకు ఎంతో మేలు చేకూరుతుందని ఎన్‌పీఎం రిసోర్స్‌పర్సన్ ముసలయ్య, మాస్టర్ ట్రైనీ అంబోజీ అన్నారు. మండలంలోని పోలవరంలో సర్పంచ్ బిడ్డక నారాయణ సమక్షంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది నీమాస్త్రం తయారీపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, ఒక పంట కాలంలో నీమాస్త్రం మూడుసార్లు పిచికారీ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్‌పీఎంఎం టీ బాలు, యూనిట్ ఇన్‌చార్జ్ బి.ధర్మారావు, బి.బాలకృష్ణ, ఐసీఆర్‌పీలు, గిరిజన రైతులు పాల్గొన్నారు.



నీమాస్త్రం తయారీపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

క్రీడలతో మానసిక ఉల్లాసం

గుమ్మలక్ష్మీపురం: క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. మండలంలోని కొత్తగూడ ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ బాలబాలికల అండర్ 14, 17 హ్యాండ్‌బాల్ జిల్లా స్థాయి ఎంపిక పోటీలు శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే పోటీలను ముందుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడల్లో రాణించడం ద్వారా ఉన్నతంగా స్థిరపడవచ్చన్నారు. అదే సమయంలో ఆరోగ్యానికి క్రీడలు దోహదపడతామన్నారు. క్రీడల్లో రాణించడం ద్వారా ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు వస్తుందన్నారు విద్యార్థి దశ నుంచే క్రీడల్లో రాణించాలన్నారు. పీడీలు వాసుదేవరావు, ఎస్.మాధవరావు, బి.వైకుంఠరావు, మురళి మాట్లాడుతూ ఎంపికలకు ఉమ్మడి జిల్లాకు చెందిన సుమారు 500 మంది విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు. ఎంపికైన విద్యార్థులు తెనాలిలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. హెచ్‌ఎం ఎస్.నాగరాజు, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



హ్యాండ్ బాల్ ఎంపిక పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

లోపించిన పారిశుధ్యం..

పాలకొండ రూరల్: కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛతా హి సేవా కార్యక్రమం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్నప్పటికీ పాలకొండలో పారిశుధ్యం మాత్రం అధ్వానంగా ఉంది. పట్టణంలో సేకరించిన చెత్తను నేరుగా నగర పంచాయతీ కార్యాలయం వద్దనే డంప్ చేస్తున్నారు. దీంతో అక్కడి శాఖా గ్రంథాలయానికి వెళ్లే మార్గం మూసుకుపోయి పాఠకులు రావడం మనేశారు. చుట్టుపక్కల నివశిస్తున్న ప్రజలు నిత్యం రోగాలతో సతమతమవుతున్నారు. పంచాయతీ కార్యాలయం దగ్గరే కూరగాయలు, కిరాణా, చేపలు, మాంస విక్రయ దుకాణాల సముదాయం ఉంది. వినియోగదారులు మార్కెట్‌కు రావాలంటేనే ఇబ్బంది పడుతున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు అవసరమైన చర్యలపై దృష్టి సారించకపోవడంతో విమర్శలు వినిపిస్తున్నాయి. అధికారులు స్పందించి పారిశుధ్య పనులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.



నగర కార్యాలయం వద్ద పేరుకుపోయిన చెత్తాచెదారాలు

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

గరుగుబిల్లి: గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం సేకరించడం ద్వారా ఆరోగ్యవంతంగా ఉంటారని ఐసీడీఎస్ ప్రాజెక్టు సెక్టార్ సూపర్‌వైజర్ ఆర్.లక్ష్మి అన్నారు. సంపూర్ణ పోషణ అభియాన్ కార్యక్రమంలో భాగంగా రావుపల్లిలో అంగన్‌వాడీ కార్యకర్తలతో పౌష్టికాహారం ఆవశ్యకతపై శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు రక్తహీనత లేకుండా అవసరమైన పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ వర్కర్లు ఎం.సావిత్రి, ఆర్.పద్మ, పి.కృష్ణవేణి, ఎం.స్వాతి తదితరులు పాల్గొన్నారు.



రావుపల్లిలో పౌష్టికాహారం వినియోగంపై అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్

నేడు భామినిలో ఉచిత వైద్యశిబిరం

భామిని: మండల కేంద్రంలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు శ్రీ భగత్‌సింగ్ చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సర్దార్ భగత్‌సింగ్ జయంతి సందర్భంగా ఉచిత వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పాలకొండ - సీతంపేట ప్రధాన రహదారికి మరమ్మతులు

పాలకొండ రూరల్: పాలకొండ - సీతంపేట ప్రధాన రహదారిలో ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం వద్ద రోడ్డుపై ఏర్పడిన గోతులనూ తాత్కాలికంగా పూడ్చారు. గోతుల వల్ల ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులపై 'ఇటు వైపు చూడరా సారూ..' శీర్షికన శుక్రవారం ప్రచురితమైన కథనానికి ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ స్పందించారు. ప్రత్యేక వాహనాలతో కంకర తెప్పించి గోతులనూ పూడ్చారు. తాత్కాలిక మరమ్మతులపై స్థానికులు సంతృప్తి వ్యక్తం చేశారు. అయితే త్వరలోనే శాశ్వత మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

సాక్షి ఎఫెక్ట్...



గోతులను పూడుస్తున్న దృశ్యం

ప్రజా సేవ చేస్తా..

భామిని: నిరంతరం ప్రజా సేవలో తరిస్తానని ఘనసర పంచాయతీ సర్పంచ్ కిల్లారి కమల తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ, తనను సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నందున ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేశారు. వీధి దీపాలు కొత్తవి వేయాలని ప్రజలు కోరగా.. వెంటనే వాటిని మార్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కార్యదర్శి కిల్లారి ఫాల్గుణరావు, తదితరులు పాల్గొన్నారు.

జాగ్రత్తలు తప్పనిసరి

పాలకొండ రూరల్: ప్రస్తుత వర్షాకాల సీజన్‌లో పలురకాల వైరల్ ఫీవర్స్‌తో పాటు మలేరియా, డెంగీ వంటి ప్రాణాంతక జ్వరాలు విజృంభించే అవకాశం ఉన్నందున జాగ్రత్తలను పాటించాలని జిల్లా మలేరియా నియంత్రణ అధికారి వై.మణి అన్నారు. పాలకొండ మండలం అన్నవరం పీహెచ్‌సీ పరిధిలో చిన్న, గొట్ట మంగళాపురం గ్రామాల్లో శుక్రవారం ఆమె పర్యటించారు. అక్కడి క్షేత్ర స్థాయి వైద్య సిబ్బందితో కలిసి ప్రజల తాజా ఆరోగ్య స్థితిగతులపై ఆరా తీశారు. రోగ నిరోధక శక్తిని పెంచే ఆహారం తీసుకోవాలని.. పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని ప్రజలకు సూచించారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి..



ఈఓఆర్‌డీ కృష్ణారావుకు వినతిపత్రం అందజేస్తున్న మండల వలంటీర్లు

భామిని: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు వలంటీర్లకు పది వేల రూపాయల జీతం ఇవ్వడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని వలంటీర్లు కోరారు. ఈ మేరకు ఈఓపీఆర్‌డీ జి. కృష్ణారావును శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వలంటీర్ల సంఘ మండల ప్రతినిధులు మలగాం కృష్ణ, ఆలవిల్లి వెంకటరావు, కాశీన లీలాకుమారి, ఆరిక సుబ్బమ్మ, తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యం తగదు..



ఎస్‌డబ్ల్యూపీసీ పనులపై సమీక్షిస్తున్న డీపీఓ రామచంద్రరావు

భామిని: చెత్త సంపద కేంద్రాల నిర్మాణ పనులపై నిర్లక్ష్యం తగదని పార్వతీపురం మన్యం జిల్లా పంచాయతీ అధికారి రామచంద్రరావు హెచ్చరించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈఓపీఆర్‌డీ జి. కృష్ణారావు ఆధ్వర్యంలో కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వెంటనే చెత్త సంపద కేంద్రాల పనులు పూర్తి చేయాలన్నారు. ఈ విషయంలో ఐదుగురు కార్యదర్శుల పనితీరు బాగోలేదని, వెంటనే వారు జిల్లా కార్యాలయానికి వచ్చి వివరణ ఇవ్వాలన్నారు. అలాగే ఈఓపీఆర్‌డీ పనితీరుపై మండిపడ్డారు.

వీఓఏలను వెంటనే విధుల్లోకి తీసుకోవాలి

పార్వతీపురం టౌన్: జిల్లాలో అక్రమంగా తొలగించిన వీఓఏలను వెంటనే విధుల్లో చేర్చుకోవాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కె.సుబ్బారావమ్మ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టరేట్ మెయిన్ గేటు దగ్గర తొలగించిన వీఓఏలన విధుల్లోకి తీసుకోవాలని ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా బెదిరింపులు, మానసిక వేధింపులు ఆపాలని, 6 నెలల బకాయి వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. వీఓఏలకు 2024 మార్చి నెల నుండి బకాయి వున్న వేతనాలు చెల్లించాలని కోరారు. ఇప్పటివరకు వేతనాలకు సంబంధించి అనేక పర్యాయాలు వినతిపత్రాలు అందించిన స్పందించకపోవడం శోచనీయమన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా తక్షణమే స్పందించి బకాయి వేతనాలు చెల్లించాలని ఆర్థిక ఇబ్బందులు నుండి వీఓఏల కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. ఇప్పటికే వందల మందిని తొలగించారని, మరి కొందరిని తొలగించేందుకు జాబితాలు తయారు చేస్తున్నారని ఇది సరికాదన్నారు. అధికారులు, స్థానిక రాజకీయ నాయకులతో కలిసి నిబంధనలకు విరుద్ధంగా వీఓఏల అక్రమ తొలగింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మధరావు గ్రామిక మహిళ సంఘం నాయకులు బి.ఇందిర, కార్యక్రమంలో బంకురు సూరిబాబు, వీఓఏలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

చిన్నారులతో కలెక్టర్..



మండలంలోని మండ గ్రామంలో గల అంగన్‌వాడీ కేంద్రాన్ని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా చిన్నారులతో కాసేపు ముచ్చటించి, వారి పఠనాసక్తిని గమనించారు. అలాగే చిన్నారులకు అందించే ఆహార పదార్థాలను రుచి చూశారు. - సీతంపేట

ప్రకృతి వ్యవసాయంతో మేలు

గుమ్మలక్ష్మీపురం: రైతులంతా శత శాతం ప్రకృతి వ్యవసాయం చేపట్టేలా ప్రోత్సాహం అందివ్వాలని ప్రకృతి వ్యవసాయ విభాగం ఉత్తరాంధ్ర రీజినల్ కో ఆర్డినేటర్ రమాప్రభ అన్నారు. గుమ్మలక్ష్మీపురం వెలుగు కార్యాలయంలో గ్రామైక్య సంఘాల అధ్యక్ష, కార్యదర్శులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించేందుకు గురువారం నుంచి నిర్వహించిన శిక్షణ కార్యక్రమాలు శుక్రవారం ముగిసింది. కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ రసాయన ఎరువులతో వ్యవసాయం చేయడం వల్ల పెట్టుబడులు పెరగడంతో పాటు దిగుబడులు తగ్గటం, భూసారం తగ్గిపోవడం వంటి పరిణామాలు సంభవించి రైతులంతా కుదేలయ్యే పరిస్థితి నెలకొందన్నారు. ప్రకృతి వ్యవసాయం చేయడం వలన పంట సాగుకు అయ్యే పెట్టుబడులు తగ్గటంతో పాటు, దిగుబడులు పెరుగుతాయని, భూసారం పెరుగుతుందని, సహజంగానే లభించే వస్తువులతో సేంద్రీయ ఎరువులు తయారు చేసుకొచ్చని తెలియజేశారు. కార్యక్రమంలో వెలుగు ఏపీఎం ఆదయ్య, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది గణేష్ చంద్ర, అన్నపూర్ణ, నిర్మలా దేవి, భూషణ రావు, సోమిరెడ్డి పాల్గొన్నారు.

ఆన్‌జాబ్ ట్రైనింగ్‌కు ఆర్ఐటీఐ విద్యార్థులు

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని భద్రగిరి ప్రభుత్వ ఆర్ఐటీఐలోని సీనియర్ విద్యార్థులు ఆన్ జాబ్ ట్రైనింగ్ నిమిత్తం హైదరాబాద్‌కు పయనమైనట్టు ప్రిన్సిపాల్ సీహెచ్ సునీల్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన మాట్లాడుతూ అక్కడి ప్రముఖ ఎల్‌అండ్‌టీ కంపెనీలో (కన్‌స్ట్రక్షన్ స్కిల్స్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్) తమ విద్యార్థులు మూడు నెలల పాటు శిక్షణ పొందుతారని, శిక్షణ కాలంలో విద్యార్థులకు ఉచిత భోజనం, వసతి సదుపాయాలతో పాటు రానూ, పోనూ ప్రయాణ ఖర్చులు కూడా ఇస్తారని పేర్కొన్నారు. ఈ మేరకు అక్కడి శిక్షణను సద్వినియోగం చేసుకొని ఉద్యోగం పొందాలని విద్యార్థులకు ప్రిన్సిపాల్ సూచించారు.



ఆన్ జాబ్ ట్రైనింగ్‌కు హైదరాబాద్ వెళ్తున్న ఆర్ఐటీఐ విద్యార్థులు

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ

జియ్యమ్మవలస: మండలంలోని వనజ గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలను ఏటీడబ్ల్యూఓ కె.చంద్రబాబు శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఉపాధ్యాయులతో మాట్లాడుతూ పదవ తరగతిలో మంచి మార్కులు సాధించాలంటే ప్రణాళిక ప్రకారం చదివించాలన్నారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. సమయ పాలన పాటించాలని లేకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. లెసన్ ప్లాన్, టీచర్ డైరీలను పరిశీలించారు. అందరూ సమన్వయంతో పని చేసి పాఠశాలకు గుర్తింపు తేవాలన్నారు. పాఠశాల సముదాయంలోని తుమ్మిగూడ, సీమలవానివలస ప్రాథమిక పాఠశాలలను సందర్శించారు. ఆయన వెంట పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవిప్రసాద్, ఉపాధ్యాయ సిబ్బంది ఉన్నారు.



వనజ పాఠశాలలో విద్యార్థుల విద్యా ప్రమాణాలను పరిశీలిస్తున్న ఏటీడబ్ల్యూఓ

22 మందితో ఉత్సవ కమిటీ

పాలకొండ : కోటదుర్గమ్మ నవరాత్రి ఉత్సవాల నిర్వహణకు 22 మందితో ఉత్సవ కమిటీని ఏర్పాటు చేశారు. స్థానిక ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ సిఫార్సుల మేరకు కమిటీని నగర పంచాయతీ మాజీ చైర్మన్ పల్లా కొండలరావు శుక్రవారం ప్రకటించారు. గార దుర్గారావు అధ్యక్షుడిగా మరో 21 మందిని సభ్యులుగా నియమించారు. ఉత్సవాలు పూర్తయిన వరకు ఈ కమిటీ ఏర్పాట్లు పర్యవేక్షిస్తుందని ఆలయ కార్యనిర్వహణాధికారి సూర్యనారాయణ తెలిపారు.



కమిటీ సభ్యులు వీరే..

గుడ్ టచ్.. బ్యాడ్ టచ్‌పై అవగాహన అవసరం

గరుగుబిల్లి: విద్యార్థినిలు గుడ్ టచ్.. బ్యాడ్ టచ్‌పై అవగాహన కలిగి ఉండాలని ఎస్‌ఐ పి.రమేష్ నాయుడు సూచించారు. మండలంలోని తోటపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో బాలికలకు పలు అంశాలపై శుక్రవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థినిల కిడ్నాప్, లైంగిక వేధింపులు నిత్యకృత్యంగా చూస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థినిలు జాగ్రత్తగా ఉండడంతోనే వీటి నుంచి బయటపడవచ్చన్నారు. విద్యార్థినిలపై జరుగుతున్న దాడులను సమర్థవంతంగా ఎదుర్కొవాలన్నారు. అవసరమైతే టోల్ ఫ్రీ నంబరు 100కు ఫోన్ చేయాలని సూచించారు. ఎవరైనా అసభ్యకరంగా ప్రవర్తిస్తే నిర్భయంగా ఫిర్యాదు చేస్తే పోక్సో కేసులు నమోదు చేస్తామన్నారు. ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ఖడ్గవలస జంక్షన్‌లో కూడా సైబర్ నేరాలపై ప్రజలను చైతన్యపరిచారు.



తోటపల్లి ఉన్నత పాఠశాలలో మాట్లాడుతున్న ఎస్‌ఐ రమేష్‌నాయుడు

రవాణా వ్యవస్థతోనే అభివృద్ధి

● బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దుర్గారావు

పాలకొండ రూరల్: రవాణా వ్యవస్థ మెరుగుపడితేనే వెనుకబడిన ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు టంకాల దుర్గారావు అన్నారు. పట్టణంలో రైల్వేలైన్ ఏర్పాటు వేగవంతానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పని చేయాలని కోరుతూ ప్రజల మద్దతు కోసం శుక్రవారం ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇదివరకే రైల్వేలైన్ సర్వేకి సంబంధించి డైరెక్ట్ ప్రాజెక్ట్ రిపోర్ట్ (డీఆర్‌పీ) కోరుతూ కేంద్రం ఆమోదం తెలిపిందన్నారు. దీంతో విజయనగరం మీదుగా రాజాం వయా పాలకొండ, కొత్తూరు, చాపర, మెళియాపుట్టి నుంచి పలాసకు చేరేలా రైల్వే మార్గం ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ లభించిందని చెప్పారు. ఈ క్రమంలో డీఆర్‌పీకి అవసరమైన నిధులు మంజూరు చేయాలని కేంద్రాన్ని కోరారు.



ప్రజా మద్దతు కోరుతూ ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

కంటి ఆపరేషన్లకు తరలింపు

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): ఆరోగ్య సురక్ష కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా గుమ్మలక్ష్మీపురం, కురుపాం మండలాల పరిధిలో ఉన్న గ్రామ సచివాలయాల గ్రామాల్లో గతంలో నిర్వహించిన నేత్ర వైద్య శిబిరాల్లో ఆపరేషన్లకు ఎంపికైన వారిని శస్త్రచికిత్సల నిమిత్తం విజయనగరంలో పుష్పగిరి కంటి ఆస్పత్రికి శుక్రవారం తరలించారు.

కురుపాం సీహెచ్‌సీ వీరిని తరలించినట్టు జిల్లా కంటి వెలుగు సెల్ నేత్ర వైద్యాధికారి జీరు నగేష్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో కంటి వైద్య సహాయకులు లక్ష్మణరావు, ఆరోగ్యమిత్ర రజని, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



రోగులను కంటి ఆపరేషన్లకు తరలిస్తున్న నేత్ర వైద్యాధికారి నగేష్‌రెడ్డి